


షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
RNI : APTEL / 2023 / 89152
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక



Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 131
సోమవారం 18 మే 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.


## శాంతి చర్చలు.. ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠిన షరతులు

- యుద్ధ నష్టపరిహారం ఇవ్వబోమని స్పష్టం
- 400కిలోల యురేనియం ఇవ్వాలని డిమాండ్
- స్తంభించిన నిధుల విడుదలకు నిరాకరణ
- ఇరాన్ సైతం ఐదు షరతులు
- పరిహారం ఇవ్వాల్సిందేనని పట్టు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 17)

ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చల్లో అమెరికా ఐదు కఠిన షరతులు విధించింది. ఇప్పటి వరకు ఇరాన్‌కు జరిగిన నష్టాలకు ఎలాంటి పరిహారం చెల్లించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఓ నివేదికను విడుదల చేసింది. ఇరాన్ తన వద్ద ఉన్న 400 కిలోల శుద్ధిచేసిన యురేనియంను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసింది. అలాగే ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో కేవలం ఒక్కదానికి మాత్రమే అనుమతి ఇస్తామని పేర్కొంది. విదేశాల్లో స్తంభించిపోయిన ఇరాన్ ఆస్తుల్లో కనీసం 25 శాతాన్ని కూడా విడుదల చేయబోమని తెలిపింది. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణల ముగింపు ఈ చర్చల పురోగతిపైనే ఆధారపడి ఉంటుందని అమెరికా లింక్ పెట్టింది. ఈ ఐదు షరతులకు ఇరాన్ అంగీకరించినా అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ముప్పు అలాగే కొనసాగుతుందని వైనెట్ న్యూస్ అభిప్రాయపడింది. మరోవైపు ఇరాన్ కూడా చర్చల కోసం ఐదు షరతులను విధించింది. ముఖ్యంగా లెబనాన్‌లో ఘర్షణలు ఆపాలని, తమపై ▶మిగతా 2లో



## ఇంధన పొదుపు: ప్రేక్షకుల్లేకుండా ఐపీఎల్ నిర్వహిస్తారా? కేంద్రానికి సీటీఐ ప్రతిపాదనలు

- ఇంధన ఆదా కోసం తప్పదన్న సీటీఐ
- కేంద్ర క్రీడాశాఖకు లేఖ
- ఆటగాళ్ల ప్రయాణం కోసం భారీ ఇంధనం
- ప్రేక్షకుల వాహనాలకూ పెట్రోల్ ఖర్చు
- అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్

2



## వితంతువులకు శుభవార్త.. ఏపీలో జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు


- ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు
- కీలక నిర్ణయం తీసుకున్న చంద్రబాబు సర్కారు
- వితంతువులకు కొత్తగా పెన్షన్లు
- త్వరలోనే ఆన్ లైన్ లో పేర్లు నమోదుకు అవకాశం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 17)

రాష్ట్రంలోని వితంతువులకు ఏపీలోని కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు ▶మిగతా 2లో

# అమరావతిలో క్వాంటం-సెక్యూర్ టెస్ట్ బెడ్.. దేశంలోనే తొలిసారి

- ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ వేదికగా పరిశోధనలు
- సైబర్ రక్షణ పరిష్కారాలకు కేంద్రంగా అమరావతి
- మేకిన్ ఇండియా సాంకేతికతలకు ఈ ప్రాజెక్టుతో ఊతం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 17)

దేశంలోనే తొలి క్వాంటం-సెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్ అమరావతిలో ఏర్పాటు కానుంది. ఈ సరికొత్త ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సొసైటీ దినోత్సవం సందర్భంగా ఆయన 'ఎక్స్' వేదికగా ఈ విషయాలు వెల్లడించారు. భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖకు చెందిన సి-డాట్, అమరావతి క్వాంటం వ్యాలీ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. అమరావతిలోని ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో ఈ టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. నెక్స్ట్ జనరేషన్ సైబర్ డిఫెన్స్ సొల్యూషన్లకు అమరావతి ఇకపై కేంద్ర బిందువుగా మారుతుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. సురక్షితమైన సమాచార మార్పిడి, నమ్మకమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు దేశ భవిష్యత్తుకు ఎంతో కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. గత ఏప్రిల్ 14న క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ ప్రారంభమైనప్పటి నుంచి ఏపీలో కీలక అడుగులు పడుతున్నాయి. టెలికమ్యూనికేషన్, ఐటీ, క్వాంటం రంగాల్లో అమరావతి వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ కొత్త టెస్ట్ బెడ్ క్వాంటం కమ్యూనికేషన్ హార్డ్‌వేర్, ఆప్టికల్ సిస్టమ్స్, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీల పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడనుంది. దీనివల్ల మేక్ ఇన్ ఇండియా టెక్నాలజీలకు ఊతం లభించడంతో పాటు అమరావతికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు దక్కుతుంది. డీప్-టెక్ ఆవిష్కరణలకు ఏపీ రాజధాని కీలక కేంద్రంగా మారబోతోంది. ▶మిగతా 2లో

## చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది?: జగన్

- ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై జగన్ స్పందన
- ఫీడ్ కంపెనీలతో కూటమి ప్రభుత్వం కుమ్మక్కైందంటూ తీవ్ర విమర్శలు
- ధరలు తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్
- లేకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 17)

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఫీడ్ కంపెనీలతో ప్రభుత్వం కుమ్మక్కై, కమీషన్ల కోసం ఆక్వా రైతులను దారుణంగా దోచుకుంటోందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పెంచిన ధరలను తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని జగన్ హెచ్చరించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు ఆక్వా రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని జగన్ విమర్శించారు. "మీ పరిపాలనలో దోపిడీకి ఏ రంగమూ మినహాయింపు కాదు. చివరకు ఆక్వా ఫీడ్ ధరల విషయంలో కంపెనీలతో కుమ్మక్కై ఆక్వా రైతులను కూడా దోచుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. ఫీడ్ కంపెనీల యాజమాన్యాలు టీడీపీ సానుభూతిపరులని, కమీషన్ల కోసం వారితో చంద్రబాబు లాలూచీ పడ్డారని, అందుకే వారు అడ్డగోలుగా ధరలు పెంచుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉందని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో ▶మిగతా 2లో

## అమరావతి.. నిర్మాణ దశలోనే అందర్నీ ఆకర్షిస్తోంది: లోకేశ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 17)

రాజధాని అమరావతి.. నిర్మాణ దశలోనే అందర్నీ ఆకర్షిస్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులను ఆకర్షిస్తూ.. నమ్మకం, ప్రతిష్ఠాత్మక లక్ష్యాలు, భవిష్యత్ గురించి సందేశం ఇస్తోందన్నారు. "క్వాంటం ఆపరేషన్స్ కోసం గోపాల్ ముంబయి నుంచి వచ్చారు. పరిశోధకుడు నాగలక్ష్మయ్య.. రేడియో ఫ్రీక్వెన్సీ వ్యవస్థలు నిర్మిస్తున్నారు. చంద్రబాబు ▶మిగతా 2లో

## స్త్రీ నిధి సమాఖ్యను బలోపేతం చేస్తాం మంత్రి సీతక్క



(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్,మే 17)

స్త్రీ నిధి సమాఖ్యను మరింత బలోపేతం చేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క తెలిపారు. సమాఖ్య ద్వారా ఇప్పటి వరకు 32 లక్షల మందికి పైగా మహిళలకు రూ.24 వేల కోట్ల రుణాలు అందించామని, వచ్చే ఐదేళ్లలో మరో రూ. 10 వేల కోట్ల సాయం అందిస్తామన్నారు. శనివారం ప్రజాభవన్‌లో స్త్రీ నిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ప్రధాన ▶మిగతా 2లో

## అంబేడ్కర్ ఆశయాలపై డప్పుల ప్రదర్శన



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 17)

బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఆదివారం విజయవాడలో డప్పులతో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. అంబేడ్కర్ 135వ జయంతి ఉత్సవాల ముగింపులో భాగంగా 'దళితుల ఆత్మగౌరవ గుండె చప్పుడు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మాధవ్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'అన్ని రాష్ట్రాల్లో అంబేడ్కర్‌ను తలచుకునేలా గొప్ప క్షేత్రాల నిర్మాణాలకు ప్రధాని మోదీ చొరవ చూపారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని జగన్ నిర్మించారని అందరూ అనుకుంటున్నారు. కానీ, అది నిజం కాదు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ సుమారు రూ.470 కోట్లు ఇందుకు కేటాయించింది' అని మాధవ్ వివరించారు. రాష్ట్రంలో డప్పు కళాకారుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామన్నారు. వారికి ఉచిత బస్సు ప్రయాణం, పింఛను, ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. దేవాలయాల సేవల్లో వారి భాగస్వామ్యం పెంచి, గుర్తింపునివ్వాలన్నారు. భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ మాట్లాడుతూ విజయవాడలోని మున్సిపల్ స్టేడియం నుంచి అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం వరకు డప్పుల ప్రదర్శన సాగుతుందన్నారు.



## విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల సర్వీస్ సెంటర్ ఏర్పాటుకు కృషి


(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 17)

విభిన్న ప్రతిభావంతులకు సంబంధించిన ఉపకరణాల సర్వీస్ సెంటర్‌ను పీఎం దివ్యాషా వయోశ్రీ పథకం కింద రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా పరిధిలోని విభిన్న ప్రతిభావంతులకు ఐవోసీఎల్ సీఎస్ఆర్ నిధులు రూ.కోటితో బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్‌ఛైర్లు, 512 ఉపకరణాలను ఇక్కడి టీజేపీఎస్ కళాశాలలో శనివారం ఆయన పంపిణీ చేశారు. పెమ్మసాని మాట్లాడుతూ.. 'గతేడాది, ఇప్పుడు కలిపి మొత్తం 1,000 మందికి పైగా లబ్ధిదారులకు ▶మిగతా 2లో

## యుద్ధ సంక్షోభం చల్లారకుంటే అనర్థమే

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 17)

పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తలెత్తిన సంక్షోభం సమసిపోకపోతే అనర్థమేనని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ పరిస్థితి సాధ్యమైనంత త్వరగా మారకపోతే గత కొన్ని దశాబ్దాల్లో మానవాళి సాధించిన విజయాలు తుడిచిపెట్టుకుపోతాయని, చెప్పుకోదగ్గ ప్రపంచ జనాభా మరోసారి పేదరిక ఊబిలోకి కూరుకుపోతుందని హెచ్చరించారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్‌కు వచ్చిన మోదీ శనివారం ది హేగ్‌లో ప్రవాస భారతీయులను ఉద్దేశించి 40 నిమిషాలసేపు ప్రసంగించారు. కొవిడ్ మహమ్మారి, ప్రపంచవ్యాప్త ఘర్షణలు, ప్రస్తుత యుద్ధ వాతావరణంలో ఇంధన సంక్షోభం వంటివి ఈ దశాబ్దాన్ని ప్రపంచానికి 'విపత్తుల దశాబ్ది'గా మార్చేశాయని గుర్తుచేశారు. వీలైనంత త్వరగా ఈ పరిస్థితుల్ని మార్చాల్సి ఉందని చెప్పారు.



### వికసిత భారత్‌లో పాలుపంచుకోండి

సాంకేతికతలో, మానవ వనరుల పరంగానూ ప్రస్తుత శతాబ్దిలో భారత్ ఓ అవకాశాల గనిగా నిలుస్తోందని మోదీ చెప్పారు. భారత్‌లోని తమ పూర్వీకుల గ్రామాలతో అనుసంధానమై, వికసిత భారత్ ప్రస్థానంలో మమేకం అయ్యేందుకు ప్రవాస భారతీయులకు ఇదొక తరుణమని చెప్పారు. "అనూహ్యరీతిలో భారత్ రూపాంతరీకరణ చెందుతోంది. జి-20 శిఖరాగ్ర సదస్సు, ప్రపంచంలో అతిపెద్ద ▶మిగతా 2లో



## తిరుమలలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు భారీగా టోల్ ఫీజు... టీటీడీ యోచన!

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 17)

తిరుమల పవిత్రతను కాపాడుతూ, పర్యావరణ హితమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తిరుమల కొండపైకి వెళ్లే పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీగా టోల్ ఫీజు విధించాలని యోచిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) ప్రోత్సాహం కల్పించడంతో పాటు, అలిపిరి వద్దే రూ.500 కోట్లతో ఒక భారీ టౌన్‌షిప్‌ను నిర్మించాలని ▶మిగతా 2లో

# ఆర్యవైశ్య మహాసభ డైరెక్టర్ కేవీ సుబ్బారావుకు ఘన సన్మానం



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 17)

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన బాలాజీ సంస్థల అధినేత, మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కేవీ సుబ్బారావుకు బద్వేలు పట్టణంలో ఘన సన్మానం జరిగింది. సిద్దవరం రోడ్డులోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహకులు వల్లంకొండు వెంకటరమణ ఆధ్వర్యంలో సుబ్బారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఇదే కార్యక్రమంలో ఇటీవల మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా నియమితులైన కొలిశెట్టి నాగరాజాను కూడా శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ నూతన డైరెక్టర్లు ఇరువురూ భవిష్యత్తులో ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో వీరు రాష్ట్ర స్థాయిలో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని, భగవంతుడు వీరికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సముద్రాల పుల్లయ్య ఉరిమి సుబ్బారావు పబ్బతి చక్రపాణి సతీష్ చిందుకూరి ప్రసాద్ పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

# టిడిపి జాతీయ అధ్యక్షులు హరి ప్రసాద్‌ను కలిసిన మార్కెట్ యార్డ్ చైర్మన్





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 17)

పోరుమామిళ్లలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బి హరిప్రసాద్‌ను బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ, బీజేపీ పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు నాగేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. సుప్రజ స్వగృహంలో జరిగిన ఈ సమావేశంలో హరిప్రసాద్ ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కష్టపడి పనిచేయాలని ఆకాంక్షిస్తూ ఆమెను ఆశీర్వదించారు. స్థానిక రాజకీయాల్లో సేవాభావంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చిన్ని సుబ్బారావు, లకిడి విజయ్, నాగార్జున, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

### అమరావతిలో క్వాంటం-సెక్యూర్ టెస్ట్ బెడ్..
# దేశంలోనే తొలిసారి

ప్రపంచ భవిష్యత్తును మార్చే సాంకేతికతలను రూపొందించడంలో ఏపీ విద్యార్థులు, స్టార్టప్‌లు భాగస్వాములు కావడానికి ఇది మంచి అవకాశమని చంద్రబాబు అన్నారు. ఈ అద్భుతమైన ప్రాజెక్టు కోసం శ్రమిస్తున్న సంస్థలకు అభినందనలు తెలిపారు. ఇందులో భాగస్వాములైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, యువ ఆవిష్కర్తలకు ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.
అభినందనలు తెలిపారు. ఇందులో భాగస్వాములైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, యువ ఆవిష్కర్తలకు ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## శాంతి చర్చలు.. ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠిన షరతులు

ఆంక్షలు ఎత్తివేయాలని, స్తంభించిన నిధులను విడుదల చేయాలని కోరింది. యుద్ధ నష్టపరిహారంతో పాటు హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని డిమాండ్ చేసింది.

## ఇంధన పొదుపు: ప్రేక్షకుల్లేకుండా ఐపీఎల్ నిర్వహిస్తారా? కేంద్రానికి సీటీఐ ప్రతిపాదనలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 17)

ప్రస్తుతం సాగుతున్న ఐపీఎల్ 2026 సీజన్‌ను పునర్వ్యవస్థీకరించాలని 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖను కోరింది. ఇంధన ఆదా కోసం మిగిలిన మ్యాచ్‌లను ప్రేక్షకుల్లేకుండా కొన్ని పరిమిత వేదికల్లోనే నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు లేఖ రాశారు. ఇటీవల దేశీయంగా లీటరు ఇంధనంపై 3 రూపాయల మేర పెరిగిన నేపథ్యంలో ఈ టోర్నమెంట్ వల్ల పర్యావరణం, ఇంధన నిల్వలపై ప్రభావం పడుతోందని సీటీఐ తన లేఖలో ప్రస్తావించింది.ఐపీఎల్ జట్లు నిరంతరం ఒక నగరం నుంచి మరో నగరానికి ప్రయాణించడం వల్ల ఇంధన నిల్వలు భారీగా ఖర్చవుతున్నాయని సీటీఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఉపయోగించే బోయింగ్ 737, ఎయిర్‌బస్ ఏ320 చార్టర్డ్ విమానాలు గంటకు 2,400 నుంచి 3,000 లీటర్ల ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌ను వినియోగిస్తాయని గుర్తుచేసింది.ఒక్కో జట్టు ఈ సీజన్‌లో దాదాపు 10 విమాన ప్రయాణాలు చేస్తుందని, దీనివల్ల ఒక్కో ఫ్రాంచైజీ 50 వేల నుంచి 70 వేల లీటర్ల ఇంధనాన్ని వినియోగిస్తోందని బ్రిజేష్ గోయల్ లెక్కలతో వివరించారు. పైగా ఒక్కో మ్యాచ్‌ను చూడటానికి దాదాపు 50 వేల మంది వరకు ప్రేక్షకులు స్టేడియాలకు వస్తుంటారని గుర్తు చేశారు. వీళ్లు వాడే వాహనాల వల్ల రోజూ వేల లీటర్ల పెట్రోల్, డీజిల్ వృథా అవుతోందని తెలిపారు. గతంలో కరోనా మహమ్మారి సమయంలో బయో-బబుల్ విధానంలో పరిమిత వేదికల్లో ఐపీఎల్‌ను విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని సీటీఐ గుర్తు చేసింది.

## వితంతువులకు శుభవార్త.. ఏపీలో జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు

పూర్తవుతున్న సందర్భంగా జూన్ 12వ తేదీ నుంచి కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులు త్వరలోనే ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల అనేక రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది?: జగన్

ఆక్వా రైతులను సిండికేట్ల నుంచి, దళారుల బారి నుంచి కాపాడేందుకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చి, ముఖ్యమంత్రి చైర్మన్‌గా 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ' (ఏపీఎస్ఏడీఏ)ని ఏర్పాటు చేశామని జగన్ గుర్తుచేశారు. ఈ సంస్థ ద్వారా సీడ్, ఫీడ్ నాణ్యత, ధరలను నియంత్రించడంతో పాటు, ఆక్వా ఉత్పత్తులకు ప్రభుత్వమే ధర నిర్ణయించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దీనికితోడు, ఆక్వా రైతులకు యూనిట్ కరెంటును కేవలం రూ.1.50కే అందించి అండగా నిలిచామని పేర్కొన్నారు. అయితే, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దేశపూర్వకంగానే ఏపీఎస్ఏడీఏను నిర్వీర్యం చేసి, తమ ప్రభుత్వ చర్యలన్నింటినీ నీరుగార్చిందని విమర్శించారు.
ఏపీఎస్ఏడీఏ అనుమతి లేకుండా కంపెనీలు ధరలు పెంచాయని ప్రభుత్వం ఇప్పుడు చెప్పడం ప్రజల చెవిలో పువ్వులు పెట్టడానికేనని జగన్ ఎద్దేవా చేశారు. "ఒక ప్రభుత్వాన్ని, చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది? వాళ్లు మీవాళ్లు కాబట్టే కదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఫీడ్ ధరల పెంపును తాత్కాలికంగా నిలిపివేశామంటూ ప్రభుత్వం మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని హితవు పలికారు. పెంచిన ధరలను పూర్తిగా వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని, రైతుల పక్షాన వైసీపీ అండగా నిలుస్తుందని జగన్ స్పష్టం చేశారు.

## విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల సర్వీస్ సెంటర్ ఏర్పాటుకు కృషి

ఉపకరణాలు అందజేశాం. రాష్ట్రంలో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు పింఛన్లు, ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్నారు' అని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఐవోసీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## యుద్ధ సంక్షోభం చల్లారకుంటే అనర్థమే

ఏఐ సదస్సులకు ఆతిథ్యం ఇచ్చి సత్తా చాటుకున్నాం. చందమామపై ఇంతవరకు ఎవరూ చేరని ప్రదేశానికి భారత్ వెళ్లగలిగింది. మున్ముందు ఒలింపిక్స్‌కూ ఆతిథ్యం ఇవ్వాలని భావిస్తున్నాం. ప్రపంచానికే వృద్ధి కేంద్రంగా మారాలనేది మా ఆకాంక్ష. భారత్‌లో మీ పెట్టుబడులకు తగిన ప్రతిఫలం ఉంటుంది. ఇది మోదీ గ్యారంటీ" అని ప్రధాని చెప్పారు.

హేగ్‌లో నెదర్లాండ్స్ రాజు విలెం అలెగ్జాండర్, రాణి మాగ్జిమాతో ప్రధాని మోదీ
వెయ్యేళ్లనాటి తామ్రపత్రాల అప్పగింత

సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రవాస భారతీయుల నుంచి ప్రధానికి ఘనస్వాగతం లభించింది. నెదర్లాండ్స్ రాజు విలెమ్ అలెగ్జాండర్, రాణి మాగ్జిమాలతో మోదీ భేటీ అయ్యారు. సుస్థిరాభివృద్ధి, వాణిజ్యం, జలవనరులు, డిజిటల్ సాంకేతికత, నవకల్పనలు, ఫిన్‌టెక్, చేపల పెంపకం వంటి రంగాల్లో రెండుదేశాల సహకారంపై చర్చలు జరిపారు. వెయ్యేళ్లనాటి ప్రాచీన అనైమంగళం తామ్రపత్రాలను నెదర్లాండ్స్ ప్రభుత్వం మోదీకి అప్పగించింది. చోళుల కాలం నాటి 21 పత్రాల బరువు 30 కిలోలు. సంస్కృతం, తమిళ భాషల్లో లిఖించిన శాసనాలు వీటిపై ఉన్నాయి.

## తిరుమలలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు భారీగా టోల్ ఫీజు... టీటీడీ యోచన!

ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర కీలక వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం రోజుకు సగటున 8,000 వాహనాలు తిరుమలకు వస్తుండటంతో పర్యావరణ, శబ్ద కాలుష్యం పెరుగుతోందని రవిచంద్ర తెలిపారు. దీన్ని నివారించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీ టోల్ విధించనున్నారు. అయితే, ఈ నిర్ణయం వెంటనే అమలులోకి రాదని, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చి, వాటి కోసం ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.ఈ ప్రణాళికలో మరో కీలకమైన అంశం అలిపిరి వద్ద రూ.500 కోట్ల వ్యయంతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం. సుమారు 150 ఎకరాల్లో నిర్మించే ఈ టౌన్‌షిప్‌లో వసతి, పార్కింగ్, భోజన సౌకర్యాలు, పూజా సామగ్రి వంటి అన్ని సదుపాయాలు కల్పించనున్నారు. "దీన్ని తిరుమల కొండ దిగువ భాగంలో అభివృద్ధి చేస్తాం" అని ఈవో తెలిపారు. భక్తులు ఇక్కడే తమ మొక్కులు తీర్చుకుని, ఆ తర్వాత దర్శనం కోసం కొండపైకి వెళ్లేలా ఏర్పాట్లు చేయనున్నారు.వీటితో పాటు, తిరుమలను కఠినంగా 'సైలెన్స్ జోన్'గా అమలు చేసి, శబ్ద కాలుష్యాన్ని 80 శాతం వరకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.100 కోట్లతో అన్నదానం వంటశాలను ఆధునికీకరించడం, క్యూలైన్లకు బదులు భక్తులను నేరుగా అన్నదానం హాల్స్‌కు పంపడం వంటి చర్యలు కూడా చేపట్టనున్నారు. ఈ సంస్కరణల ద్వారా భక్తులను నిరుత్సాహపరచడం కాదని, వారి దర్శనాన్ని మరింత ప్రశాంతంగా, ఆధ్యాత్మికంగా మార్చడమే తమ ఉద్దేశమని ఈవో రవిచంద్ర వివరించారు.

## అమరావతి.. నిర్మాణ దశలోనే అందర్నీ ఆకర్షిస్తోంది: లోకేశ్

విజన్ నమ్మి భవిష్యత్ తరాల కోసం కృషి చేస్తున్నారు. క్వాంటం నిర్మాణంలో సాయపడుతున్న యువత కృషి అభినందనీయం. డీప్-టెక్ హబ్‌కు అమరావతి క్వాంటం వ్యాలీ ఓ స్ఫూర్తి" అని అన్నారు.

## స్త్రీ నిధి సమాఖ్యను బలోపేతం చేస్తాం: మంత్రి సీతక్క

కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, డిప్యూటీ ఎండీ శ్రీనాథ్, ఇతర అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "మైక్రో ఫైనాన్స్ సంస్థలు, అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్న మహిళలను ఆదుకోవడానికే 2011లో స్త్రీనిధి సమాఖ్య ఏర్పాటు చేశారు. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ జీవనోపాధిని మెరుగుపరుస్తున్నాం. మహిళలకు స్త్రీ నిధి నమ్మకమైన బ్యాంక్‌గా మారుతోంది" అని సీతక్క తెలిపారు. అనంతరం త్వరలో పదవీ విరమణ చేయనున్న ఎండీ విద్యాసాగర్‌రెడ్డిని సీతక్క సత్కరించారు.


# నరహరి సాంబయ్యకు "అభినందన సభ"





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 17)

ప్రకాశం జిల్లా కాపు సంఘం కార్యాలయం నందు ఈ ఆదివారం ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కాపు ముద్దు బిడ్డ, ప్రకాశం జిల్లా కాపు సంఘం ఉపాధ్యక్షుడు "నరహరి సాంబయ్య" ఒంగోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డిఆర్ఆర్‌యం మునిసిపల్ హైస్కూల్ నందు 60 జరిగిన వాకింగ్ పోటీలో ప్రథమ బహుమతి పొంది, "70 ఆలిండియా మాస్టర్స్ చాంపియన్షిప్" 2025-2026 సంవత్సరమునకు "ఆల్ ఇండియా" లెవెల్‌లో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 1,500 మీటర్లు, 5,000మీటర్ల నడక, పరుగు పోటీలలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించి, వరల్డ్ మాస్టర్స్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్స్ 2026, థాయిలాండ్ నందు 5,000 మీటర్లు రన్నింగ్, 5,000 మీటర్లు వాకింగ్, 1500 మీటర్లు రన్నింగ్, మూడు గోల్డ్ మెడల్స్ సాధించిన కాపు కుటుంబ సభ్యులైన నరహరి సాంబయ్యకి "అభినందన సభ" ఏర్పాటుచేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కాపు సంఘం నాయకులు బండారు మదన్, గొర్రెపాటి శ్రీనివాసరావు, తోటకూర వెంకట్రావు, నాగిశెట్టి బ్రహ్మయ్య, పసుపులేటి శ్రీనివాసరావు, జేష్ఠ ప్రసాద్, నారపుశెట్టి రామ్మోహన్‌రావు, అయినాబత్తిన గోపికృష్ణ, తంజావూరి శ్రీనివాసమూర్తి, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, నరహరి దుష్యంత్, వల్లంశెట్టి హనుమంతరావు, చింతలపల్లి నారాయణ, చెన్నంశెట్టి శివ, లింగిశెట్టి సుబ్బారావు, వాసాని అంకబాబు, రావెళ్ళ రాఘవ, అడుసుమల్లి వీరబ్రహ్మం, మిరియాల వెంకటేశ్వర్లు, ఉంగరాల వెంకటేశ్వర్లు, ఇందుర్తి మస్తాన్ కుమార్, ఇందుర్తి మస్తాన్‌రావు, ఇందుర్తి డుమ్ము, మల్లెల చెన్నకేశవులు, గారా సంజయ్‌కృష్ణ, మంగిశెట్టి శ్రీనివాసరావు, పేస్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.





ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు


తెలుగు దినపత్రిక

18.05.26 సోమవారం


# 20 లక్షల సూర్యఘర్ కనెక్షన్లు ప్రజలకు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్







**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 17)**

రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలో ఆదివారం మంత్రి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కొటికలపూడి పంచాయతీ పరిధిలోని పార్వతీపురం, తిమ్మారెడ్డిపాలెం నుంచి కొటికలపూడి వరకు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రారంభించారు. ఈ రహదారి ద్వారా గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు రైతులు, విద్యార్థులు, స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా కొటికలపూడి పంచాయతీ పరిధిలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లను కూడా మంత్రి ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుదలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. అనంతరం శ్రీరామ్ నగర్ కాలనీలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని మంత్రి ప్రారంభించారు. ఇప్పటికే ముందుకొచ్చి దరఖాస్తు చేసుకున్న 6 లక్షల మందికి ఉచితంగా సోలార్ కనెక్షన్లు అందిస్తున్నామని వెల్లడించారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా బీసీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.20 వేల రాయితీ అందిస్తోందని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 20 లక్షల సూర్యఘర్ కనెక్షన్లు ప్రజలకు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. విద్యుత్ శాఖలో సూర్యఘర్ పథకంతో పాటు ఆర్డీఎస్ఎస్ పనులను కూడా త్వరలోనే పూర్తి చేసే దిశగా చర్యలు వేగవంతం చేశామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అనంతరం కొటికలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో దేవాలయ ప్రహరీని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రారంభించారు. ఈ ప్రహరీ నిర్మాణానికి ఏపీ ట్రాన్స్ కో సీఎస్ఆర్ నిధుల నుంచి రూ. 15 లక్షల కేటాయించినట్లు పేర్కొన్నారు.

**మహానాడు నిర్వహణపై మంత్రి గొట్టిపాటి సమీక్ష**

తెలుగుదేశం పార్టీ నిర్వహించనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పని చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పిలుపునిచ్చారు. అద్దంకి నియోజకవర్గ నేతలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మంత్రి మహానాడు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది మహానాడును వర్చువల్ విధానంలో నిర్వహించేందుకు గల కారణాలను పార్టీ క్యాడర్‌కు వివరించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ అధ్యక్షులు, కీలక నేతల ప్రసంగాలు వర్చువల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అవుతాయని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కార్యకర్తలు, అభిమానులు వర్చువల్ గా పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. నేతల ప్రసంగాలను అందరూ వీక్షించేలా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. మహానాడు ద్వారా పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ విజయాలు, భవిష్యత్ కార్యాచరణను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నామని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని కోరారు.

4

# ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను మానవత్వంతో చూడాలి

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 17)**

సమాజంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను మానవత్వంతో చూసి వారికి సహాయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా ఆదివారం రాత్రి మార్కాపురం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి బారినపడి మృతి చెందిన

4లో

# సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

4

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 17)**

ఈ నెల 21 నుంచి జూన్ 4వ తేదీ వరకు జిల్లా లో జరగనున్న ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో ఆదివారం విద్యాశాఖతో పాటు సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల కేంద్రాల వద్ద



# కంటి వైద్య శిబిరానికి భారీ స్పందన

## – 419 మందికి వైద్య పరీక్షలు – 150 మందికి శస్త్ర చికిత్సలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 17)**

పొదిలి పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి భారీ స్పందన వచ్చిందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 419 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 156 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు నిర్ధారించారు. వారందరికీ ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి ఈ ఉచిత కంటి వైద్య శిబిరం గురించి ప్రచారం నిర్వహించామని, ఈ ప్రచారానికి మంచి స్పందన లభించిందన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారు ఎవరు భయపడకుండా ఉండాలన్నారు. శంకర కంటి ఆసుపత్రి యాజమాన్యం మంచి వైద్యం అందిస్తారన్నారు. ఈ ఆపరేషన్లు మొత్తం ఉచితంగా నిర్వహిస్తారని, భోజనం, రవాణా ఖర్చులు కూడా రోగులు చెల్లించవలసిన అవసరం ఉండదన్నారు. మొత్తం ఉచితంగానే ఆపరేషన్ నిర్వహిస్తారని అన్నారు. అనంతరం పొదిలి మండలానికి చెందిన స్వచ్ఛరథంను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఎంపిడిఓ శ్రీనివాసులు, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మండల పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాజీ జడ్పీటిసి సభ్యులు కాటూరి వెంకట నారాయణబాబు, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లిఖార్జున, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

4







# ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను మానవత్వంతో చూడాలి

వారిని గుర్తు చేసుకోవడం, వారికి భరోసాను కల్పిస్తూ అండగా నిలవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. హెచ్ఐవి బారిన పడకుండా వీలైనంత ఎక్కువ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డిసెంబర్ నాటికి ఈ వ్యాధిని కట్టడి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గత సంవత్సర కాలంగా 228 హెచ్ఐవి పాజిటివ్ కేసులు వచ్చాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకట శివరామిరెడ్డి, ఇన్చార్జి డిఎంహెచ్వో కే రాహుల్, ఇతర వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# 20 లక్షల సూర్యఘర్ కనెక్షన్లు ప్రజలకు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం





# సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

పోలీస్ బందోబస్తు, విద్యుత్ నీటి సౌకర్యం, అలాగే విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ సెంటర్లను లేకుండా చూడాలన్నారు. మార్కాపురం జిల్లాలో మొత్తం 22 కేంద్రాల్లో 9502 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయబోతున్నారని పరీక్షల నిర్వహణ అధికారులు తెలిపారు. అదేవిధంగా సమస్యల కోసం 08592 281275 టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేసినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఆయా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకట శివరామిరెడ్డి, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆర్ఐవో కె. ఆంజనేయులు, సభ్యులు రమణారెడ్డి, ఇన్చార్జి డిఎంహెచ్వో రాహుల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కంటి వైద్య శిబిరానికి భారీ స్పందన









# రావినూతలలో శానిటేషన్ పై సంతృప్తి



**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, మే 17)**

మండలంలోని రావినూతల గ్రామంలో స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఎండిఓ రాజ్యలక్ష్మి, సెక్రటరీ దుర్గ తో కలిసి డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. గ్రామంలో శానిటేషన్ పై ఆయన సంతృప్తి వ్యక్తం చేసి సెక్రటరీ దుర్గాను అభినందించారు. డంపింగ్ యార్డ్ రూపు రేఖలు మార్చి ఆదాయ వనరులు వచ్చే విధంగా త్వరలోనే చర్యలు చేపడతానని సెక్రటరీ దర్గా ఆయనకు తెలియజేశారు. పంచాయతీకి స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా తన వంతు సహకారం ఉంటుందని చిన్ని శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అద్దంకిలో నేడు నిరసన కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 17)**

పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుదలను నిరసిస్తూ సోమవారం పట్టణంలో పెట్రోల్ బంకు వద్ద వైయస్సార్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందని వైయస్సార్ పార్టీ కార్యాలయ ప్రతినిధి ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఇంచార్జ్ డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పాల్గొంటారని వారు పేర్కొన్నారు. కావున నియోజకవర్గంలో ఉన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# వినుకొండలో హోరెత్తిన డప్పు దరువు

## జాతీయ స్థాయి డప్పుల ప్రదర్శనను ప్రారంభించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు







**(షణ్ముఖ వెలుగ, వినుకొండ, మే 17)**
వినుకొండ పట్టణం సాంస్కృతిక కళల వేదికగా మారింది. వినుకొండ దరువు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "జాతీయ స్థాయి డప్పుల ప్రదర్శన" ఆదివారం సాయంత్రం పల్నాడు జిల్లా వినుకొండలోని ఎన్ఎస్పీ కాలనీ మైదానంలో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరై, ప్రదర్శనలను అధికారికంగా ప్రారంభించారు.

**ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ మహిళా జట్లు**

ఈ అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడుల నుండి ప్రఖ్యాతి గాంచిన డప్పు కళాకారుల జట్లు తరలివచ్చాయి. ఈ పోటీలలో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ రాష్ట్రం నుండి రెండు మహిళా డప్పు జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటుతుండటం విశేషం. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన జట్ల హోరైన ప్రదర్శనలతో ఎన్ఎస్పీ కాలనీ మైదానమంతా డప్పు దరువులతో మారుమోగిపోయింది.

**కళాకారులకు ఎల్లప్పుడూ ఎన్డీయే ప్రభుత్వం అండ : జీవీ ఆంజనేయులు**

ఈ సందర్భంగా ముఖ్యఅతిథి జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ డప్పు కళ మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని, అలాంటి గొప్ప కళను బ్రతికించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. వినుకొండ గడ్డపై ఇలాంటి జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రదర్శనలను ఎంతో చక్కగా నిర్వహిస్తూ, కళాకారులకు బహుమతులు అందజేస్తూ ప్రోత్సహిస్తున్న నిర్వాహకులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. తనకు డప్పు కళ అంటే ఎంతో ఇష్టమని చెబుతూ.. తన సొంత గ్రామమైన ఇనిమెట్లలో డప్పు కళాకారులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి, వారిని ప్రోత్సహించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే డప్పు కళాకారుల సంక్షేమాన్ని గుర్తించి, వారికి 50 సంవత్సరాలకే పెన్షన్ మంజూరు చేసి ఆదుకున్నామని చెప్పారు. డప్పు కళాకారులకు ఎల్లప్పుడూ ఎన్డీయే ప్రభుత్వం, చంద్రబాబు నాయుడు అండగా ఉంటారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మానుకొండ శివప్రసాద్, దరువు కమిటీ ప్రతినిధులు, స్థానిక కూటమి నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు, కళాభిమానులు తరలివచ్చి ఈ ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గంజాయి వంటి మాదకద్రవ్యాలు, నేరాలు నియంత్రణే లక్ష్యం

**ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా కార్డన్ సెర్చ్**
**కార్డన్‌సెర్చ్‌లో 85 మోటార్ సైకిళ్లు, రెండు ఆటోలు స్వాధీనం**









**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, మే 17)**
మాదక ద్రవ్యాల నిర్మూలనే, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు దర్శి డిఎస్పీ పి బాలమురళికృష్ణ ఆధ్వర్యంలో మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో కాలనీ, పరిసర ప్రాంతంలో విస్తృత స్థాయిలో ఆపరేషన్ వజ్రాప్రహార్‌లో భాగంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, అద్దంకి టౌన్ సిఐ సుబ్బరాజు, సంతమాగులూరు సిఐ శేషగిరీరావు, మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ, జె పంగులూరు ఎస్ఐ వినోద్ కుమార్, సంతమాగులూరు ఎస్ఐ పట్టాభిరామయ్య, సిబ్బంది 45 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ పరికరాల ద్వారా అనుమానితుల తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లు, దుకాణాలు, గంజాయి కేసుల్లోని పాత ముద్దాయిల ఇళ్లు, ఇతర ప్రదేశాలను సోదాలు చేశారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 85 మోటార్ సైకిల్, రెండు ఆటోలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొందరు వాహన యజమానులకు చలానాలు విధించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, కొత్త చట్టాలు, మహిళలపై నేరాలు, వాటి శిక్షల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. తదనంతరం "డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదంతో స్థానిక ప్రజలతో కలిసి గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. యువత, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని "గంజాయిని పారదోలుదాం, డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడుదాం" అంటూ ప్రతిజ్ఞ చేశారు. దర్శి డిఎస్పీ పి బాలమురళికృష్ణ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, ఉపాధి వంటి వాటిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ విక్రయం లేదా వినియోగానికి పాల్పడిన, ఎవరైనా అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత వాహనాలు కొనుకోలు చేసే ముందు అన్ని డాక్యుమెంట్ లు సరిగా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని సూచించారు.

# మార్కాపురం కలెక్టరేట్లో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 17)**
మార్కాపురం కలెక్టరేట్‌లో ఈ నెల 18వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో స్పష్టంగా రాసుకొని అధికారులకు అందజేయాలన్నారు. అదే విధంగా 1100 నెంబర్ కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతో పాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చు అన్నారు. అలాగే అర్జీదారులు వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# గ్రంథాలయంకు కంప్యూటర్ బహూకరణ





**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 17)**
మండలంలోని చిన్నగంజాం శాఖ గ్రంథాలయం నందు వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథపాలకుడు అలహరి లక్ష్మీ మోహన్ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ వై రామాంజనేయులు విద్యార్థులకు యోగలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ వై రామాంజనేయులు, రాజు, బంగారుపాలెం ఇన్చార్జ్ హెడ్మాస్టర్ ఆర్ఎస్‌వి పి రాజు చేతుల మీదుగా డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చివరిగా ఎన్ఆర్ఐ అమెరికా వాస్తవ్యులు దాత కుర్రి శ్రీనివాసరావు స్వంత నిధులతో విద్యార్థులు, గ్రంథాలయ అవసరం కోసం సమకుర్చిన రూ.30 వేలు విలువ చేసే కంప్యూటర్‌ను గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాపాలకుకుడు మాట్లాడుతూ దాత కుర్రి శ్రీనివాసరావు గతంలో గ్రంథాలయానికి కంప్యూటర్లు ప్రింటర్లు అందజేయటం జరిగింది. ఇప్పుడు మళ్ళీ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థుల ఉపయోగార్ధం గ్రంథాలయానికి ఒక కంప్యూటర్‌ని అందజేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు మోహన్, లక్ష్మీ నరసింహాచార్యులు, రిసోర్స్ పర్సన్లు వై రామాంజనేయులు, ఆర్ఎస్‌విపి రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

**నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక**
**జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
**జిల్లా కలెక్టర్ పి రాజబాబు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 17)**
మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వేసవి కాలం ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ప్రజలు మార్పును గమనించాలని కోరారు. ప్రజలు నిర్దేశించిన సమయానికి కార్యక్రమానికి చేరుకొని వారి వారి సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేయాలని సూచించారు.

## జగన్ ముఖ్యమంత్రి కావాలని పాదయాత్ర

**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, మే 17)**



రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2029లో ముఖ్యమంత్రి కావాలని, డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఎమ్మెల్యే కావాలని కోరుచు ఈనెల 19వ తేదీన పమిడిపాడు ఎస్సీ కాలనీ నుండి గుణదల మేరీ మాత గుడి వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పాలపర్తి శ్రీధర్(చిట్టి) తెలియజేశారు. సాయంత్రం 6 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సీనియర్ నాయకులు వైవి భద్రారెడ్డి, వైయస్సార్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ లు పాల్గొని పాదయాత్ర ను ప్రారంభిస్తారని ఆయన తెలియజేశారు. ఈ పాదయాత్రలో సుమారు వందమంది వైసిపి కార్యకర్తలు, జగనన్న అభిమానులు పాల్గొంటారని చెప్పారు. కావున నియోజకవర్గంలో వివిధ హోదాలో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 17)**
మండల కేంద్రమైన ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు జాతీయ నాయకుల జీవిత చరిత్రలు మొదలగు పుస్తకాలు చదివించి అనంతరం వారికి ఇంగ్లీష్ పదాలలో డిక్టేషన్ పోటీలు నిర్వహించడం జరిగినది. చివరిగా పిల్లలకు స్నాక్స్ అందించడం జరిగినది. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు 15 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.

# శాంతి భద్రత, నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యం

### ఆపరేషన్ వజ్ర ప్రహార్‌లో భాగంగా కార్డన్ సెర్చ్
### పైడిపాడు గ్రామంలో ఆపరేషన్ వజ్ర ప్రహార్

**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, మే 16)**
ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సింగరాయకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై శ్రీహరి, జరుగుమల్లి ఎస్ఐ పి భాగ్యరాజ్, సిబ్బంది ఆదివారం జరుగుమల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పైడిపాడు గ్రామంలో "ఆపరేషన్ వజ్రపహార్" కార్యక్రమంలో భాగంగా కార్డన్ సెర్చ్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 5 నుండి 7 గంటల వరకు పైడిపాడు గ్రామ పరిసర ప్రాంతాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయడం జరిగింది. తనిఖీలలో భాగంగా సరైన పత్రాలు లేని 8 మోటార్ సైకిళ్లు, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా గ్రామ పరిసరాల్లో గంచాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక నిఘా నిర్వహించారు. కార్యక్రమం అనంతరం ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఒంగోలు ఈగల్ టీం , పోలీసు సిబ్బందితో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, వినియోగించడం, సరఫరా చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, వాటి వలన కలిగే అనర్ధాలను వివరించారు. అలాంటి కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే 1972 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ. 10,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. హెల్మెట్ మన ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని, మన ప్రాణం మన కుటుంబానికి ఎంతో విలువైనదని, చిన్న నిర్లక్ష్యం కుటుంబాలను విషాదంలోకి నెట్టవచ్చని ప్రజలకు వివరించారు. అలాగే మహిళలపై జరిగే నేరాలు, వేధింపులు మరియు ఫ్రాజుజూ చట్టంపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. మహిళలను వేధించడం నేరమని, అలాంటి కేసుల్లో కఠినమైన శిక్షలు ఉంటాయని తెలియజేశారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలపై కూడా ప్రజలను అప్రమత్తం ఉండాలని,.తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పకూడదని, అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయవద్దని, ఆన్లైన్ మోసాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చివరిగా వేసవి కాలంలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నందున బంగారు ఆభరణాలు, నగదు మరియు విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని, ప్రయాణాల సమయంలో ఇళ్లకు భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా గ్రామ ప్రజలు, యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ వై శ్రీహరి, జరుగుమల్లి ఎస్ఐ భాగ్యరాజ్, టంగుటూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు, ఈగల్ టీం సిబ్బంది, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.








# ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేయాలి

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 17)**
ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 2వ రోజు ఆదివారం దివాకర్ అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొని గేట్ మీటింగ్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఎలక్ట్రికల్ బస్సులు ప్రైవేట్ సంస్థలకు అప్పగించి ఆర్టీసీని ప్రైవేట్ పరం చేయడానికి వ్యతిరేకించారు. ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేయాలని ఆర్టీసీ సిబ్బందితోటే నడపాలని, ఎలక్ట్రిక్ బస్సులకు ఎంప్లాయిస్ యూనియన్ వ్యతిరేకం కాదని తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సుల పేరిట డిపోలు ఖాళీ చేసి ఉద్యోగస్తులకు వేరే డిపోలకు బలవంతంగా బదిలీ చేసే విధానాన్ని మానుకోవాలి డిమాండ్ చేశారు వెంటనే 11వ పిఆర్సి బకాయిలు చెల్లించాలని, డిఏ అరియర్స్ ఇవ్వాలని కొత్త డీఏలను వెంటనే ప్రకటించాలని, 12వ పి ఆర్‌సి కమిషన్‌ని నియమించి ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేసారు. శ్రీ శక్తి పథకం నిర్వహణలకు అదనంగా 3,000 బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 12 సంవత్సరాలుగా ఆర్టీసీలో రిక్రూట్మెంట్ జరగలేదని రిటైర్మెంట్‌లు అత్యధికంగా జరిగాయని, వారి స్థానంలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మెయింటెనెన్స్ కమిటీ మెంబర్ పి కొండలరావు, రీజినల్ బాధ్యులు టీ ఎస్ పార్వతి, డిపో అధ్యక్షులు ఎండిఏ బాజీ, డిపో కార్యదర్శి పి ఓబులేసు, ట్రెజరర్ ఎస్ కే జిలాని, అసిస్టెంట్ సెక్రెటరీ ఎస్‌కే భాష, ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.



# కోడి పందేల పై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి



## నలుగురు పట్టివేత

### రెండు కోళ్లు, రెండు ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 17)**
ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సీఐ భీమా నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ చెంచయ్య , సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు. అక్రమ కోడి పందేల నిర్వహణ పై ఒంగోలు టాస్కోర్స్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. నాగులుప్పలపాడు మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉప్పుగుండూరు, ఒమ్మెవరం మధ్య నిర్వహించిన దాడిలో అక్రమంగా కోడి పందేలు నిర్వహిస్తున్న 4గురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్ళు, రెండు సెల్ ఫోన్లు, ఒక మోటర్ సైకిల్‌లను స్వాధీనం చేసుకున్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. దాడిలో పట్టుకున్న వారిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

# ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేర నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యం

## 'ఆపరేషన్ వజ్రప్రహార్' లో భాగంగా కార్డన్ సెర్చ్



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 16)

మాదక ద్రవ్యాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ అసాంఘిక కార్యకలాపాల కట్టడిని లక్ష్యంగా చేసుకుని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కందుకూరు డిఎస్పీ బాలసుబ్రమణ్యం అధ్వర్యంలో కందుకూరు సర్కిల్ సిఐ అన్వర్ భాష, సబ్ డివిజన్ 5 మంది ఎస్ఐలు, 40 మంది పోలీస్ సిబ్బంది కలసి కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏకలవ్యనగర్ కాలనీలో, పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 'ఆపరేషన్ వజ్రా ప్రహార్'లో భాగంగా కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇళ్లు, దుకాణాలు, పాత ముద్దాయిల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. కొత్త వ్యక్తులు యొక్క వివరాలను సేకరించారు. సరైన పత్రాలు లేని 41 బైక్ లు, 1 ఆటో, 1 కార్ లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించి వారి యొక్క వేలిముద్రలను ఫింగర్ ప్రింట్స్ ఐడెంటిఫికేషన్ ద్వారా తనిఖీ చేయటం నేర నియంత్రణకు జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా కందుకూరు డీఎస్పీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ యువత, ప్రజలు గంజాయి సహా అన్ని రకాల మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబ, ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తి అనేక అనర్థాలకు గురయ్యే ప్రమాదం ఉందని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల కాల్స్‌కు స్పందించి ఓటీపీలు చెప్పవద్దని హెచ్చరించారు. అలాగే ఆన్‌లైన్ గేమ్స్,క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, ఆధార్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పే మోసగాళ్లను నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చట్టాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, ప్రజలతో కలిసి "మత్తుకు దూరంగా ఉండాలి-మత్తు లేని సమాజాన్ని నిర్మిద్దాం" అనే ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులు, ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 లేదా డయల్ 112 లేదా పోలీస్ వాట్సఅప్ నెంబర్ 9121102266 తెలియజేయాలని ప్రజలను కోరారు.





# భాస్కర్ తండ్రిని పరామర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి





(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, మే 17)

మండల సోషల్ మీడియా అధ్యక్షులు లింగంగుంట్ల భాస్కర్ తండ్రి లింగంగుంట్ల ఏసోబు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా పుల్లలచెరువు మండల అధ్యక్షులు దోమకాల వెంకటేశ్వర్లు పాల్గొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. లింగంగుంట్ల ఏసోబు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.

# అద్దంకిలో మహానాడు ఏర్పాట్ల పై సమీక్ష





(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 17)

తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంపై అద్దంకి నియోజకవర్గ నాయకులతో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది మహానాడును వర్చువల్ విధానంలో నిర్వహించడానికి గల కారణాలను పార్టీ క్యాడర్‌కు మంత్రి వివరించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ అధ్యక్షులు, కీలక నేతల ప్రసంగాలు వర్చువల్ ద్వారా ప్రసారం అవుతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. నేతల ప్రసంగాలను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామని, మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధారణా శక్తికి ప్రతీకలు శతకాలు

## టిటిడి ధర్మాచార్య ఎంవిఎస్ శాస్త్రి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 17)

ధారణా శక్తిని వృద్ధి చేసుకునేందుకు శతక సాహిత్యం ఎంతగానో దోహదం చేస్తుందని టీటీడీ ధర్మాచార్య ఎంవిఎస్ శాస్త్రి పేర్కొన్నారు. ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చిన్మయ మిషన్ తోడ్పాటుతో శ్రీగిరి గో క్షేత్ర భవన్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీగిరి చిన్మయ బాలవిహార్ కార్యక్రమంలో శాస్త్రి పాల్గొని శతక సాహిత్యం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇతర సాహిత్య ప్రక్రియల కన్నా యతిప్రాసలతో గణాలతో కూడిన ఛందో బద్ధమైన కవిత్వం విషయాన్ని ఎక్కువ కాలం గుర్తుంచుకునేందుకు తోడ్పడుతుందని తెలిపారు. మహాకవులుగా ప్రసిద్ధులైన వారు శతకాలను కూడా రచించారని తెలిపారు. విద్యార్థులు విషయాన్ని ఎక్కువ కాలం గుర్తుంచుకునేందుకు సృజన శీలతను అభివృద్ధి చేసుకునేందుకు పద్య కవిత్వం తోడ్పడుతుందని, అందువలన విద్యార్థులు తెలుగు భాషలోని ప్రసిద్ధ శతకాలు, శ్లోకాలను నేర్చుకుంటే వారి జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుందన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించగలుగుతారని, భాషాభిమానులుగా ఎదగగలుగుతారని వెల్లడించారు. శ్రీగిరి చిన్మయ బాలవిహార్ శిక్షణా తరగతుల్లో భాగంగా గత కొన్ని వారాలుగా వేమన పద్యాలను విద్యార్థులకు నేర్పడం జరిగిందన్నారు. వేమన శతకంలోని పద్యాల పై విద్యార్థులకు పోటీని నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేయడం జరుగుతుందని శాస్త్రి తెలిపారు. సుమతి శతకం, భాస్కర శతకం వంటి శతకాలతో పాటు భారత భాగవత రామాయణ కావ్యాలలోని పద్యాలను శ్లోకాలను కూడా విద్యార్థులకు నేర్పించడం జరుగుతుందని వెల్లడించారు. తనకు ఈ అవకాశం కల్పించిన శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణికి ధర్మకర్తల మండలి ప్రతినిధులకు నిర్వాహకులకు శాస్త్రి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆలూరు జై శంకర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు, శ్రిష్టి పద్మావతి తదితరులు నిర్వహణా సహకారం అందించారు. శ్రీ గిరి దేవస్థానం నిర్వాహకులు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో పాటు భక్తులకు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. శ్రీగిరి దేవస్థానం చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో ప్రతి ఆదివారం శ్రీగిరి గో క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీగిరి చిన్మయ బాలవిహార్ శిక్షణా తరగతులను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.





## ఎమ్మెల్యేచే జాతీయ శాంతి సేవా పురస్కారం అందుకున్న టిడిపి యువ లీడర్ శివ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 17)

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలోని శ్రీ సూర్య రెస్టారెంట్ ఫంక్షన్ హాల్ నందు శాంతియుతంగా కలిసి జీవించే అంతర్జాతీయ దినోత్సవం కార్యక్రమాన్ని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ కోట రాధ, మేడిది వెంకటసుబ్బయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు మేడిది వెంకటేశ్వరరావులు సంయుక్తంగా నిర్వహించారు. తెలుగు రెండు రాష్టాలలోని స్వచ్ఛందంగా సేవ చేస్తున్న సామాజిక కార్యకర్తలను ఎన్టిఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, డాక్టర్ బొడ్డపాటి దాస్, మేడిది వెంకటేశ్వరరావు, రంగా నాగేంద్రబాబు, ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఖాజా బాబా, కోట రాధ చేతుల మీదుగా జాతీయ శాంతి సేవా పురస్కారం 2026 అందుకున్నారు. అనంతరం మార్కాపురం యువ టిడిపి లీడర్ పిన్నిక శివ మాట్లాడుతూ సామాజికంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ లో గత 18 సంవత్సరాల నుండి ఆధ్యాత్మికంగా శాంతి సందేశం అందిస్తున్నారు. ఇలాంటి ప్రసంగాలు చేస్తున్న కృషికి నాకు నేను చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలను గుర్తించి శాంతి పురస్కారం అందించినందుకు ఆంధ్ర ప్రదేశ్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కన్వీనర్ కోట రాధ కి, మేమెంటోలు అందించిన మేడిది వెంకటేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌ను కలిసిన మార్కాపురం జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు పివి కృష్ణారావు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 17)

విజయవాడ నగరంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌ని బిజెపి మార్కాపురం జిల్లా నూతన అధ్యక్షులు పీవీ కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మార్కాపురం చెన్నకేశవ స్వామి ప్రసాదాన్ని అందించి, మార్కాపురం జిల్లా బిజెపి అధ్యక్షుడిగా ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. తన మీద నమ్మకంతో తనకు మార్కాపురం జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చినందుకు మార్కాపురం జిల్లాలో పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేస్తానని తెలియజేశారు. త్వరలో జరగబోవు నూతన జిల్లా కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు వారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మార్కాపురం పట్టణ కన్వీనర్ రాజా శ్రీకాంత్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు దేశబోయిన శ్రీనివాసులు, జిల్లా నాయకులు మండల శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## రిలయన్స్ ఫౌండేషన్, సార్డ్స్ సంస్థ వారి ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ పై శిక్షణ



(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, మే 17)

మండలంలోని దుగ్గిరెడ్డిపాలెం గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, సార్డ్స్ సంస్థ వారి ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ పై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామంలోని 30 మంది మహిళలకు కుట్టు మిషన్‌ల పై శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడంలో భాగంగా 45 రోజులు పాటు జరుగుతుందన్నారు. అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మండల కో ఆర్డినేటర్ విజయ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విడిఎఫ్ సభ్యులు, మహిళలు, టైలరింగ్ ఇన్స్ట్రక్టర్ పాల్గొన్నారు. ఇంతటి చక్కని అవకాశాన్ని కల్పించిన రిలయన్స్ ఫౌండేషన్, సార్డ్స్ సంస్థ వారికి ధన్యవాదాలు తెలిపారు.

# హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండాలి

## జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జి బాలాజీ






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 17)

మేము గుర్తుంచుకుంటాం, మేము అవగాహనతో ముందుకు వెళతాం, మేము చర్య తీసుకుంటాం, అనే ఒకే లక్ష్యంతో ప్రభుత్వ సంస్థలు స్వచ్ఛంద సంస్థలు అందరం సమిష్టి కృషితో హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిని సమూల నిర్మూలనకు హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు పట్ల, ప్రేమ ఆప్యాయత కలిగి ఉండాలని ప్రకాశం జిల్లా లెప్రసీ టిబి, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జి బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్యారోగ్యశాఖ, జిల్లా హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం స్వచ్ఛంద సంస్థలు, ఆధ్వర్యంలో ఒంగోలు ప్రకాశం భవనం నుండి స్థానిక చర్చి సెంటర్ వరకు గత కొన్ని సంవత్సరాలుగా హెచ్ఐవి ఎయిడ్స్ మరణించిన వారికి ఆత్మ శాంతి కలిగించాలని, వారి కుటుంబ సభ్యులకు మేము ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటామని వాళ్ళ ఆత్మస్థైర్యం కలిగిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవి ఎయిడ్స్‌తో మరణించిన వారికి నివాళులు అర్పించే కార్యక్రమాన్ని ముందుగా జిల్లా లెప్రసీ టిబి, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జి బాలాజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ మహమ్మారిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలంటే సమాజంలో ప్రతి ఒక్కరు ఒక లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ వ్యాధి ఎలా సోకుతుంది, వ్యాధి రాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని అంశాల పైన క్షేత్రస్థాయి వరకు కళాశాలలో, గ్రామాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అంతే కాకుండా హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధితో మరణించిన కుటుంబాలుకు అన్ని విధాల అండదండలుగా ఉండి వారు ఆత్మస్థైర్యం కోల్పోకుండా చూడవలసిన బాధ్యత ఉందన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత వీడనాడాలన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు వ్యాధి ప్రభావం కంటే సమాజంలో వారి పట్ల చూపించిన వివక్షత వల్లే మానసిక ధైర్యాన్ని కోల్పోయి, సమాజం, కుటుంబ సభ్యులు చూపించే వివక్షతను భరించలేక ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతుందన్నారు. మానసిక ఆందోళనకు, అనారోగ్యానికి గురై మరణిస్తున్నారన్నారు. ఇది చాలా బాధాకరమైన విషయం అని అన్నారు. ఎవరు కూడా హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపించకూడదన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. ఏఆర్టి సెంటర్ ద్వారా మందులు తీసుకుని వాడుకోవడం ద్వారా వారి జీవితానికి ఎటువంటి ప్రమాదం ఉండదని పేర్కొన్నారు. ఒంగోలు ఏఆర్‌టి సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జోసప్ శామ్యూల్ మాట్లాడుతూ హెచ్ఐవి, సిఫిలిస్, హైపటైటిస్‌బి పూర్తిస్థాయిలో నిర్మూలించేంత వరకు ఒకే లక్ష్యంతో మనమందరం పనిచేయాలన్నారు. తల్లి, బిడ్డ రక్షించి వ్యాధులు లేని సమాజాన్ని నిర్మించుట కొరకు అందరం కలిసికట్టుగా పని చేద్దామన్నారు. ట్రాన్స్ జెండర్స్, సెక్స్ వర్కర్స్ పట్ల వివక్షత విడనాడాలని, వారికి ప్రభుత్వ పథకాలు చేరువ అయ్యేవిధంగా చూడాల్సిన బాధ్యత మనందరి పై ఉందని పేర్కొన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ జాతీయ టోల్ ఫ్రీ 1097పై హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ చట్టం 2017 పైన హెచ్ఐవి ఎయిడ్స్ బాధితుల కొరకు ప్రభుత్వం ద్వారా అందేటువంటి ఐసిటిసి సెంటర్స్, ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలు గురించి అందరికీ అవగాహన కలిగించాల్సిన బాధ్యతుందని పేర్కొన్నారు. ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్, పాజిటివ్ నెట్ వర్క్ పీపుల్స్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, ప్రకాశం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సిబంది, సిఎస్‌వో ఎస్ సాయి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, గ్రో స్వచ్ఛంద సంస్థ సినార్డ్, ప్రోగ్రాం మేనేజర్లు బి దుర్గ, సురేంద్ర, ఎస్‌కె పీర్ భాష, వెంకటేశ్వర్లు, లింక్ వర్కర్స్, జిల్లా రిసోర్స్ పర్సన్ స్వరూప్ కుమార్, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, గ్రో స్వచ్ఛంద సంస్థ డ్యాప్కు వులిడ్ సిబ్బంది, ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ నర్సింగ్ విద్యార్థులు, ఏఆర్‌టి, ఐసిటిసి సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

## పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 17)

హనుమాన్ ఆశీస్సులు ఒంగోలు నగర ప్రజలందరి పైన సంపూర్ణంగా ఉండాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ఆకాంక్షించారు. హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్, హనుమాన్ సేవాసమితి, భగీరథ కెమికల్ ఫ్యాక్టరీ మేనేజర్ లింగమనేని వెంకటరామయ్య, సౌజన్య, సహకారంతో ఏర్పాటుచేసిన హనుమాన్ శోభాయాత్రను సంతపేట వీరాంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభాయాత్రను ఎమ్మెల్యే దామచర్ల జండా ఊపి ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఒంగోలు నగరంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించటం గొప్ప శుభ పరిణామమని దామచర్ల జనార్దన్ రావు అన్నారు. హనుమాన్ ఆశీస్సులతో ఒంగోలు నగరం మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంతపేట, రాంనగర్, నెల్లూరు బస్టాండ్, కేశవస్వామి పేట మీదుగా నగరపుర వీధుల్లో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. పలువురు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా వీహెచ్పీ బజరంగ్దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభ యాత్ర అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే సనాతన ధర్మాన్ని కాపాడుతూ పురాతన వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని 30 లక్షలు తో జీర్ణోద్ధార చేసిన వెంకట రామయ్యకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మఠంపల్లి దక్షిణామూర్తి, నిడమనూరి కళ్యాణ్ చక్రవర్తి, రమేష్, మఠంపల్లి దుర్గేష్, నాగేంద్ర, బండారు మదన్, గడ్డం ఆదినారాయణ, అజయ్, విశ్వహిందూ పరిషత్, తదితరులు పాల్గొన్నారు. భక్తుల శ్రీరామ నామస్మరణతో శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు.























Printed by O Radhakrishna Dass On behalf of HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Published from Dr.No. 4-255, PANDARIPURAM CHILAKALURIPET H/O, PURUSHOTHA PATNAM CHILAKALURIPET, GUNTUR, ANDHRA PRADESH - 522616. Mobile : 9494177939, RNI : APTEL/25/A2455, E-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com.